క్లుప్తంగా

సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా బట్టు అంకన్న



ఆత్మకూరు: ఆత్మకూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా బట్టు అంకన్న (గ్రేడ్-1 అధికారి)కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెబుతూ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి చింతామణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన సుబ్బారెడ్డి సెలవుపై వెళ్లారు. త్వరలోనే బట్టు అంకన్న బాధ్యతలు స్వీకరించనున్నారు.

40 ఏళ్ల తరువాత నిండిన ఏనుగుల చెరువు



చెరువు నిండి ప్రవహిస్తున్న నీరు

శ్రీశైలం : క్షేత్ర పరిధిలోని ఏనుగుల చెరువు సుమారు 40 ఏళ్ల తరువాత నిండింది. చెరువునీరు రోడ్లపైకి చేరడంతో చెరువును తలపిస్తున్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం అప్పటి భారీ తుపాను కారణంగా నిండిందని, తిరిగి గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చెరువు నిండిందని స్థానిక పెద్దలు చెబుతున్నారు.

ఎడమగట్టు నూతన సీఈగా రామసుబ్బారెడ్డి



సీఈ రామసుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం నూతన చీఫ్ ఇంజినీర్‌గా రామసుబ్బారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ హెచ్-64 యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మయ్య సీఈకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు. కార్మికుల సమస్యలపై సీఈతో చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.యేసయ్య, ఎం.మత్తేష్, పులి మల్లికార్జున, కె.సీతామాలక్ష్మి, సరోజినమ్మ తదితరులు పాల్గొన్నారు.


15లోగా పంట నమోదు చేసుకోవాలి



ఈ-కేవైసీ ప్రకియను పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ 15వ తేదీ లోపు ఈ- పంట నమోదు చేసుకోవాలని ఏఓ పవన్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నమోదైన వివరాలతో సరి చూసుకొని జియో కోఆర్డినేట్స్‌తో సహా పంటల ఫొటోలు తీసి రైతు సేవా కేంద్రం సిబ్బంది అప్లోడ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకష్ట, నాగమణి పాల్గొన్నారు

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ



సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

నందికొట్కూరు: మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం తిరుపతిలోని మాతృ సంస్థకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, ఘనంగా సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆరు నెలల పాటు సహకరించిన ఉద్యోగులను మరవలేనన్నారు. ఆర్వో విజయలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



కేసీ కాల్వ నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

జూపాడుబంగ్లా: స్థానిక కేసీ కాల్వ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏరాట్లు చేయాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయనాయక్ ఆదేశించారు. ఆయన మంగళవారం జూపాడుబంగ్లా సమీపంలోని కేసీ కాల్వ వద్ద నిమజ్జనం జరిగే స్థలాన్ని పరిశీలించారు. ఈనెల 7న వినాయకచవితి పండుగ సందర్భంగా మూడు రోజుల పూజల అనంతరం 9వ తేదీ మండలంలోని వివిధ గ్రామాల్లోని వినాయక విగ్రహాలను కేసీ కాల్వలో, నందికొట్కూరు పట్టణంలోని విగ్రహాలను ఈ నెల 11న జూపాడుబంగ్లా కేసీ కాల్వలో నిమజ్జనం చేయనున్నట్లు చెప్పారు. వినాయక శోభాయాత్ర, నిమజ్జనంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో పాటు బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలన్నారు. కాల్వలో రోప్‌తో పాటు పడవలను సిద్ధంగా ఉంచాలని సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణను ఆదేశించారు. అనంతరం ఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బుధవారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, సర్పంచ్, కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి నిమజ్జనం ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సీఐ సుబ్రమణ్యం, ఏఎస్ఐ మేరీజయంతి, సర్పంచ్ మొట్టె బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండండి

ఆత్మకూరురూరల్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరిని మోసగించేలా సైబర్ నేరగాళ్లు ప్రణాళికలతో ఉన్నారన్నారు. సోషల్ మీడియాలో ఎన్నోరకాల ప్రలోభాలకు గురి చేస్తూ రెఫరల్ లింక్ లు పెడుతూ.. దాన్ని ఓపన్ చేయడంద్వారా నగదు బహుమతి పొందమని ఊరిస్తూ ఉంటారని పేర్కొన్నారు. ఆ లింక్ టచ్ చేస్తే చాలు వారి ఖాతాలో సొమ్ము మాయమవుతుందని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేములు పెద్ద మోసమని, ఫైన్ పడిందని ఫోన్ చేస్తూ కూడా మోసగిస్తారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి తేరుకున్న వారు వెంటనే 1930 కు ఫోన్ చేసి సమాచారమిస్తే మీ సొమ్ముకు భద్రత ఉంటుందన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోండి

శ్రీశైలం : గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ ప్రసాదరావు సూచించారు. క్షేత్ర పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమై కౌన్సెలింగ్ ఇచ్చారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. నిమజ్జన ఊరేగింపు శాంతియుతంగా నిర్వహించుకోవాలని అన్నారు.

పగిద్యాల: ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిద్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం గ్రామాల్లో ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని, ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. డీజేలు, పెద్ద స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదలిపెట్టబోమని హెచ్చరించారు.

వాట్సాప్‌లో హాయ్ చెబితే అనుమతులు

నందికొట్కూరు: వినాయక మండపాల ఏర్పాటుకు వాట్సాప్‌లో హాయ్.. అని పంపితే అనుమతి లభిస్తుందని రూరల్ సీఐ సుబ్రమణ్యం స్పష్టం చేశారు. బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో ఆయన మంగళవారం వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. 91211 01181 ఫోన్ నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మేసేజ్ పంపిస్తే మిగతా ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుపుకుని అనుమతులు మంజూరవుతాయని చెప్పారు. అలాగే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం మొబైల్‌కు వస్తుందన్నారు. ఎస్ఐ తిరుపాలు ఉన్నారు.

కేంద్ర పథకాలు చెంచులకు అందిస్తాం

ఆత్మకూరు: నల్లమల అడవుల్లోని గిరిజనులకు పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని ఎంపీడీఓ జి.మోహన్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కె.జి.నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని రుద్రకోడూరుగూడెం, అమలాపురంగూడెంలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. చెంచుగూడెంలలో నివసిస్తున్న చెంచు గిరిజనుల స్థితిగతులు, జీవన పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ పక్కా గృహాలు, ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, ప్రధాన రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

జూపాడుబంగ్లా: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆయన మంగళవారం సిబ్బందితో కలిసి పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న కర్నూలు-గుంటూరు రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం బైక్‌లు, ఆటోలను తనిఖీచేసి లైసెన్స్, పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు, ధ్రువీకరణ, అనుమతి పత్రాలు లేని 11 మంది డ్రైవర్లకు రూ.5,585 జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

కొత్తపల్లి: అర్హులైన గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని ఎంపీడీఓ మేరి సూచించారు. మండలంలోని పాలెంచెరువు గిరిజన గూడెంలో మంగళవారం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. వ్యవసాయం, వ్యాపారం చేస్తూ వృద్ధిలోకి రావాలన్నారు. సర్పంచ్ మశమ్మ, డాక్టర్ మహమ్మద్ బేగ్, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, పంచాయతీ కార్యదర్శి చాంది ని, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

పాక్షికంగా దెబ్బతిన్న మట్టి మిద్దెలు

వెలుగోడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో ఐదు మట్టి మిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ తెలిపారు. వెలుగోడు గ్రామంలో రెండు, మోత్కూర్‌లో రెండు, బోయరేవుల గ్రామంలో ఒకటి దెబ్బతిన్నాయని ఆయా గ్రామాల వీఆర్వోల ద్వారా సమాచారం అందిందని తెలిపారు.

సంక్షిప్తం

లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వొద్దు

కొత్తపల్లి: మైనర్లకు, లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వరాదని ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. ఆయన మంగళవారం సింగరాజుపల్లె, శివపురం గ్రామాలలో ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను మైనర్లకు, లైసెన్స్ లేనివారికి ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాధితులను ఆదుకుంటాం

కొత్తపల్లి: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామని తహసీల్దార్ ఉమారాణి మంగళవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో భారీ వర్షాలకు సుమారు 22 ఇళ్ల గోడలు కూలిపోవడం, దెంతెలు విరగడం, కొట్టాలు దెబ్బతినడం జరిగిందని వివరించారు. వీటిపై గ్రామ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

నిత్యావసర సరుకుల అందజేత

పాములపాడు: ఇబ్బందుల్లో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ ఆపన్న హస్తం అందించాలని బంగారం ఉశేన్‌బాషా అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో భారీ వర్షానికి ఇల్లు నేలమట్టం కావడంతో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

నందికొట్కూరు: భారీ వర్షాలకు పంట చేలల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న, మినుము, కంది, పత్తి, సోయాబీన్, పెసర, తదితర పంట చేలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటిని బయటకు పంపి పంటలను కాపాడుకోవాలన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు.

రెండు ఎద్దులు మృతి

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో రైతు రామచంద్రుడుకు చెందిన ఎద్దులు యూరియా, డీఎస్‌పీ అమ్మోనియం సల్ఫేట్ కలిపిన నీరు తాగడంతో మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రైతు రామచంద్రుడు తన ఇంట్లో యూరియా, డీఎస్‌పీ అమ్మోనియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని కడుగు నీళ్లుగా భావించి ఎద్దులకు తాపారు. ఎద్దులు అస్వస్థతకు గురికావడంతో పశువైద్యాధికారి చంద్రమోహన్ చికిత్స చేసినా రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. రూ.1.50 లక్షలు విలువైన ఎద్దులు మృతిచెందడంతో రైతు ఇంట విషాదం నెలకొంది.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



నీటి శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

పాములపాడు: గ్రామంలో పెరుగుతున్న డయేరియా కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ వెంకటరమణ సూచించారు. ఆయన మంగళవారం వేంపెంట గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. మరో 4 డయేరియా కేసులు నమోదుకావడంతో కారణాలపై వైద్యులను ప్రశ్నించారు. నీటి కాలుష్యమే ప్రధాన కారణమని చెప్పగా గ్రామంలో శుద్ధ జలం సరఫరా చేస్తున్నా కేసులు ఎలా పెరుగుతున్నాయని ప్రశ్నించారు. డయేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, జాగ్రత్తలను వివరించాలన్నారు. మెరుగైన వైద్యసేవలందించి వ్యాధిని అదుపులోకి తీసుకురావాలన్నారు. ల్యాబ్ నుంచి నీటి శాంపిల్స్‌ను పరిశీలించారు.

పసుపులో దుంపకుళ్లును నివారించాలి



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి హరిచందన

పాములపాడు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పసుపు పంటలో దుంప కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారిణి హరిచందన అన్నారు. ఆమె మంగళవారం బానకచెర్ల గ్రామంలో పసుపు పైరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. పైరును కాపాడుకోవడానికి పలు జాగ్రత్తలు సూచించారు. దుంపకుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల వద్ద పోయాలన్నారు. పైరుకు 19:19:19 మందును లీటరుకు 5 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. వీఏఏ ఇలియాస్ పాల్గొన్నారు.

అరటిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నంద్యాల(అర్బన్): అధిక వర్షాల వల్ల అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఎక్కువగా సోకేందుకు అవకాశం ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మహానంది ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ముత్యాలనాయుడు సూచించారు. ఉద్యాన అధికారి శ్రీధర్‌తో కలిసి మహానంది మండలం శ్రీనగరం, బుక్కాపురం గ్రామాల్లోని అరటి, పసుపు పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆకుమచ్చ తెలుగు నివారణకు మ్యాంకోజెబ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి, ప్రొపికోనోజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మినరల్ ఆయిల్ 5 ఎంఎల్ లీటరు నీటితో కలిపి పిచికారీ చేస్తే తెగులును నివారించుకోవచ్చన్నారు. పసుపులో సూక్ష్మధాతు లోపాలు, ఆకుమచ్చ తెగులు రావడానికి అవకాశం ఉందని, దీని నివారణకు ఎం-45 2గ్రాములు లీటరు నీటితో, ఫెర్రాస్ సల్ఫేట్‌తో మెగ్నీషియం సల్ఫేట్ 3గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నందికొట్కూరు: భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈఓ పార్వతమ్మకు వినతి పత్రం అందజేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొత్తపల్లి: పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. ఈ నెల 15 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈ-కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, ఇందుకోసం రైతులు తమ ఆధార్ కార్డుతో స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.25 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, వాకిటిపేట కౌలు రైతుసంఘం అధ్యక్షుడు అష్రఫ్అలీ, మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ కౌలు రైతు సంఘం, వాకిటిపేట కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులు వేసుకున్న మొక్కజొన్న, కంది, వరి, సోయాచిక్కుడు తదితర పంటలకు చేతికొచ్చే సమయంలో నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు ఎ.రణధీర్, కౌలు రైతులు శ్రీనివాసులు, పి.నాగన్న, రఫిక్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో దృష్టిలోపం నివారణ



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల దృష్టిలోపాన్ని నివారించవచ్చని ఎంపీడీఓ మేరీ, వైద్యాధికారి మహమ్మద్ బేగ్ సూచించారు. పాలెంచెరువు గూడెం ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను కంటి వైద్యాధికారి షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేత్రదానం ప్రాముఖ్యత, దృష్టిలోపాలు – తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి వివరించారు. గుడ్లు, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, మాంసం వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తి మరణించిన ఆరు గంటల్లోపు ఐ బ్యాంకు వారికి సమాచారం ఇస్తే వైద్యాధికారులు వచ్చి స్టెరైల్ పద్ధతిలో కళ్లను సేకరిస్తారని, ముఖంపై మచ్చ పడడం, వికృతంగా మారడం ఉండదని వివరించారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీరాములు, ఏఎన్ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధి బాధితులకు పరామర్శ



వైద్య శిబిరంలో బాధితుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి

పాములపాడు: అతిసార వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి కోరారు. ఆయన మంగళవారం వేంపెంట గ్రామంలో అతిసార వ్యాధితో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి వారికి బ్రెడ్లు పంపిణీ చేశారు. వ్యాధితో మృతి చెందిన బోయ లక్ష్మీదేవి కుటుంబసభ్యులను ఓదార్చి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలోని వైద్య శిబిరాన్ని సందర్శించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులు నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీడీఓ గోపీకృష్ణలతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ సమస్యపై జిల్లా కలెక్టర్ రాజకుమారితో మాట్లాడినట్లు చెప్పారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశామన్నారు. గ్రామం చుట్టూ నీరు ఉండడం వల్ల నీరు కాలుష్యం అవుతోందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌వీ రమణారెడ్డి, శివపుల్లారెడ్డి, బాలునాయక్, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, చలమారెడ్డి, సుబ్బారెడ్డి, ఏసురత్నం, సామేలు, ఉశేన్, ప్రభాకర్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని మహానంది తహసీల్దార్ రమాదేవి సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మంగళవారం వినాయక చవితి మండపాల నిర్వాహకులతో మండల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాట్లను సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, కార్యదర్శి శివ, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నందికొట్కూరు: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీదేవి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం ఆత్మకూరు డివిజన్ స్థాయి వార్డెన్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యార్థులకు కాచీ చల్లార్చిన నీటిని ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. వసతి గృహం పరిధిలోని వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహ పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు. ప్రతి నెలా విద్యార్థులకు ప్రభుత్వ వైద్యుల చేత వైద్య పరీక్షలు చేయించాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతే ధ్యేయం



ప్రసాద్‌కు దగ్గరుండి వైద్యం చేయిస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా , కో-ఆప్షన్ సభ్యుడు రషీద్

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రతే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మారుఫ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రోషద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న మురహరిప్రసాద్ మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుండెపోటు గురయ్యాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యుడు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని రూ.40 వేలు విలువచేసే గుండెకు సంబంధించిన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేయించారు. మెరుగైన వైద్యంకోసం డాక్టర్లతో చర్చించి దగ్గరుండి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. ప్రస్తుతం ప్రసాద్ ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు బంధువులను అడిగి తెలుసుకుంటున్నారు. కర్నూలు ప్రభుత్వ వైద్యాధికారులు అన్ని పరీక్షలు చేసి, ప్రసాద్‌కు ప్రాణాపాయం తప్పిందని, అందాల్సిన వైద్యం ఆత్మకూరులోనే అందిందని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మున్సిపల్ కార్మికులు, ప్రసాద్ కుటుంబ సభ్యులు చైర్మన్‌కు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పోతిరెడ్డిపాడు గేట్ల పర్యవేక్షణ



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఈ కబీర్‌బాషా

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా ఆదేశించారు. ఆయన మంగళవారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నందున పోతిరెడ్డిపాడు గేట్లపై ఒత్తిడి పడకుండా గేట్లు ఎత్తి, దించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అలాగే గేట్లకు అవసరమైన మరమ్మతులు నిర్వహించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున జీఎన్ఎస్ఎస్, కేసీ ఎస్కేప్, తెలుగుగంగ కాల్వల్లో నీటి ప్రవాహాన్ని అనుసరించి కాల్వలకు నీటిని విడుదల చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఈ సుబ్బరాయుడు, ఈఈ పార్థసారథి, ఏఈలు విష్ణువర్ధన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌లో 14.440 టీఎంసీల నీరు

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా 1,500 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. వీబీఆర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా మంగళవారం 14.440 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5000, వన్ ఆర్ తూముకు 10 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 10 క్యూసెక్కులు నీటి విడుదల చేయడం జరుగుతుందని తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు.

ఆశావర్కర్ల వేతనాలు పెంచాలి



వైద్యాధికారి మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

పగిద్యాల: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి విశేష సేవలందిస్తున్న ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే.భాస్కర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. 2024 ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పంద జీఓలు, సర్కులర్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. పని భారంతో ఆశాలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్‌వర్క్, సెంట్రల్ వర్క్, అదనపు పనులు అంటూ పనిచేయని సెల్‌ఫోన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి మోహన్‌కు అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు స్వప్న, మహేశ్వర బాయ్, మార్తమ్మ, పార్వతమ్మ, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.